# కళ్యాణి - కార్తీక పౌర్ణమి

## 'ధరణి'

**అమ్మాయ్!** ఇంకా నిద్ర లేవవూ?

బామ్మగారి కంచు కంఠం ఖంగున హాల్లో మార్మోగింది.

భర్త పక్కన బద్ధకంగా మెదిలింది కళ్యాణి.

"అయ్యో తల్లీ! ఎంతకీ లేచి రావేమే!" ఈ సారి ఆ గొంతులో కాస్త విసుగుదల మిళితమయింది.

చలిని అంత చీకటిన లేవాలంటే కళ్యాణికి చాలా బాధనిపించింది. అందునా రాత్రి ఏదో సీరియస్ కేసు చూస్తూ పన్నెండింటి వరకూ పడుకోలేదు. దాని గురించి కళ్ళు మత్తునుండి విడి పడటం లేదు.

బామ్మగారి పిలుపు, భార్య ఇంకా ముడుచుకు పడుకోవడం నిద్ర లోనే లీలగా గమనిస్తున్న ప్రభాకర్ ఆమె నడుము చుట్టూ చెయి తిప్పి మరి కాస్త దగ్గిరికి తీసుకున్నాడు.

"ఒక పక్క సూర్యుడు పైకి రావడానికి తొందర పడుతుంటే, ఇంకా ఏం నిద్ర!"

ఇక లాభం లేదు—బామ్మకి కోపం కూడా వచ్చేలా ఉంది అనుకుంటూ మెల్లగా భర్త పట్టునుండి విడిపించుకుని బయటి కొచ్చేసింది.

అమ్మడు లేచిందిలా ఉంది. లేస్తూనే తన ముఖం చూస్తుందో, ఏమో అనుకుంటూ బామ్మగారు అప్పటికే పక్కకి తప్పుకున్నారు.

"చీకట్లయినా ఇంకా విడలేదు. ఏమిటే, బామ్మా, తొందర?" అని చలికి ముకుళించుకుంటూ ఆవిడ దగ్గరకు రానే వచ్చింది.

"ఓసి నీ అమ్మ కడుపు చల్లగుండా! ఒక పక్క ఆలస్యమై పోతుందని నేను తొందర పడుతుంటే, అప్పుడే ఏమిటంటూ కూర్చో! వెళ్ళి కాలకృత్యాలు పూర్తి కానియ్! సూర్యుడు తులారాశిలో ఉండగా స్నానం, దీపారాధన చెయ్యాలని చెప్పలేదూ!" అంటూ ఆవిడ గద్దించినట్లనడంతో అలాగేలే—అంటూ పేస్ట్ బ్రష్ పై రాచుకుని హడావుడిగా బాత్‌రూమ్‌కి పరుగెత్తింది కళ్యాణి.

రామనామం జపం చేస్తూ పూజ సామగ్రి సిద్ధంచేయసాగారు బామ్మగారు. ఆవిడ అప్పటికే తలారా స్నానం చేసి ఉండటం మూలాన చలిని లెక్క పెట్టడం లేదు.

కళ్యాణి, ప్రభాకర్‌ల పెళ్ళయి ఆరు మాసాలయింది. ఇద్దరూ డాక్టర్లే! ఆడది ఎన్ని డిగ్రీలు సంపాదించినా—పెళ్ళయిన తొలి సంవత్సరం కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమికి నియమంతో వ్రతాలు చేస్తే కాని స్త్రీగా పరిపూర్ణం చెందరు! ఇది కొందరి సనాతుల్లో బలంగా నాటుకుపోయిన ఆచారం. ఈ ఆచారం తప్పితే గ్రహచారం పట్టుకుంటుందన్న భయంతో నియమ నిష్ఠలకు భంగం కలగనీయరు.

ఇక ముందు ముందు వ్రతాలు చేసినా, చేయకపోయినా ముందు సంవత్సరంలోనైనా ఘనంగా పూజలవీ చేయించాలి... అమ్మాయిని పుట్టింటికి పంపించమంటూ కళ్యాణి తండ్రి వస్తే ససేమిరా వీల్లేదన్నాడు ప్రభాకర్.

ప్రాక్టీస్ పెట్టి రెండు నెల్లయినా పూర్తి కాలేదు. ఇప్పుడిప్పుడే తమ పేరు బయటి కొస్తూంది. ఈ సమయంలో అమెని పంపిస్తే ప్రాక్టీస్ దెబ్బ తింటుంది. ఆ చేసే వేహో ఇక్కడే చేస్తుంది లేండంటూ తిప్పి పంపించాడు.

అలా లాభం లేదురా అబ్బాయ్! కుర్ర వాజమ్మ దానికేం తెలుస్తుంది కాని, నన్నే అక్కడికి పంపించు. దగ్గరుండి అన్నీ సక్రమంగా చేయించి వస్తానంటూ బామ్మగారు బయలుదేరారు.

ముందు రోజే కళ్యాణి తమ్ముడు ఆవిడను దిగవిడిచి వెళ్ళాడు.

ఏ మాట కామాటే చెప్పుకోవాలి. అసలా పల్లెటూర్లో అమ్మడి కాపురం ఎలా సాగుతుందో చూడాలని మొదటి నుంచి మహా ఇదిగా ఉంది లెండి! చెప్పొద్దూ! ఆ కోర్కె భగవంతుడే ఈ విధంగా తీర్చాడని బామ్మగారికి మహా సంతోషంగా ఉంది లెండి!

పల్లెటూళ్ళోనే ప్రాక్టీస్ పెట్టాలన్నది వాళ్ళ పంతం కాదు కాని, గవర్నమెంటు ఉద్యోగాలు దొరికించుకునే కంటే ఇద్దరూ కలిసి ఏదేనా వైద్య సదుపాయం బాగాలేని పూళ్ళో ప్రాక్టీస్ పెడితే పేరుకి పేరూ వస్తుంది, జీవనానికీ లోటుండదని బాగా ఆలోచించి ఆ నిర్ణయాని కొచ్చారు.

పెళ్ళయినప్పటినుంచీ అటువంటి పూరి కోసం గాలిస్తుంటే, ఒక మిత్రుడి ద్వారా తెలిసింది. తనకి పరిచయమున్న డాక్టరొకాయన ఫారిన్ అవకాశం రావడంతో వెళుతున్నాడని, హాస్పిటల్ అద్దె కిచ్చే ప్రయత్నంలో ఉన్నాడని, ఆ పూళ్ళో ప్రాక్టీస్ బాగానే ఉంటుందని చెప్పడంతో, అతడ్ని తీసుకుని అక్కడికి వెళ్ళి చూసి ఫరవా లేదనిపించడంతో మంచి రోజు చూసుకుని కళ్యాణితో కాపురం పెట్టేశాడు ప్రభాకర్.

"రామకృష్ణ గోవింద నారాయణా" అంటూ వత్తులు చేస్తూ గోవింద నామాలు చదువుతున్న బామ్మగారికి అడ్డు తగులుతూ—

"ఇప్పుడు చెప్పు, బామ్మా, ఏం చేయాలి!" టవల్‌తో ముఖం తుడుచుకుంటూ అడిగింది కళ్యాణి.

"ఇంద, ఈ పసుపు తీసుకుని అలా నూతి దగ్గిరికి నడువ్" అంటూ తనూ ఆమె వెంట నడిచారు.

నూతిలో నీళ్ళు చేదతో లాగితే మంచుముద్దల్లా ఉన్నట్లనిపించినయ్. ఈ నీళ్ళతో స్నానం చేసే దెలాగా అనుకుంటూ చలికి బిగుసుకుంటూ దిక్కులు చూస్తుంటే—

"కానియ్!" అంటూ బామ్మగారు ఉరిమేసరికి తలారా పోసుకుని కెవ్వుమంది, వజవజ వణికి పోతూ.

"ఏమి చోద్యమే, తల్లీ, నేను చెయ్యలా! రామాకృష్ణా అనుకుంటూ కుమ్మరించుకుంటే చలీ గిలీ ఏమీ ఉండదు. ఇలా తే ఆ బకెట్" అని గబగబ నీరు లాగి ఏహో మంత్రాలు వల్లిస్తూ స్నానం పూర్తి చేయించారు.

"కార్తీక పౌర్ణమి కాదు కాని, నన్ను చంపేలా ఉన్నావ్ బామ్మా" అంటూ గబగబ జుట్టు తుడుచుకో సాగింది.

"అపచారమే, తల్లీ! నువ్వెంత డాక్టరమ్మ వైతే మాత్రం ఆడవాళ్ళు చేసే విధులు మరిచిపోతే ఎలా?" కోసి పెట్టుకున్న పూలవీ తీసుకుని లోనికి నడిచారు ఆమె. అలా అంటూ.

ఈ రోజు బామ్మ శాసనం అమలు పరచటమే తన విధి. తప్పదు. సాయంత్రం చంద్రుడు కనిపించే వరకూ ఉపవాసంకూడా నట. ఎలా చేయాలో ఏమో?

సూర్యుడు పైకొస్తే దీప ఫలిత ముండదు. తొందరగా రమ్మంటూ బామ్మగారి బొబ్బ వినరావడంతో, చీరె కట్టు ముగించి, అప్రయత్నంగా తూర్పు దిక్కుకి చూసేటప్పటికి చింత నిప్పులా బయటి కొస్తూ కన్పించాడు సూర్య భగవానుడు.

కళ్యాణి చిన్నగా నవ్వుకుంటూ సూర్యుడు రావడానికి మరో అరగంటైనా పడుతుందిలే బామ్మ అంటూ, ముందు రోజే బామ్మగారు దేవుడికి మంటప మదీ ఏర్పరిచి పూజకి అనువుగా ఏర్పరిచిన గది లోనికి వెళ్ళింది.

ఆవిడ చెప్పినట్లుగా పూజ పూర్తి చేసేటప్పటికి తెల్లగా వెలు గొచ్చేసింది.

కాఫీ, టిఫిన్‌లు కానిచ్చి ప్రభాకర్ హాస్పిటల్ కెళ్ళిపోయాడు.

ఈ రోజుకి హాస్పిటల్ మానెయ్‌మని కళ్యాణికి బామ్మగారు చెప్పడంతో, అంత అర్జంట్ కేసులుకూడా ఏం లేకపోవడంతో నూ ఆమె ఇంటి దగ్గరే ఉండిపోయింది.

కాఫీ చుక్క గురించి నాలుక పీకుతున్నా బామ్మగారిమాట బాగా గుర్తుంచుకుని ఓపికతో ఉండిపోయింది. బామ్మగారింకా పూజ గదిలోనే కూర్చుని మొక్కల్లా ఉన్న వాటి మొదళ్ళనా మట్టదీ లేకండా శుభ్రం చేస్తున్నారు.

"ఆవేం మొక్కలు, బామ్మా! ఎందుకు?" అని అడుగుతూ వెళ్ళింది.

ఇవి... ఇల్లుగల బామ్మగారితో చెబితే వాళ్ళ పొలంలో ఉన్నాయని తెప్పించి పెట్టారు. దీన్ని కందగొడుగు అంటారు. దీన్నేమో పసుపు గొడుగంటారని వివరించారు.

"వీటికి నీ చేత్తోనే పసుపు రాసి బొట్టు పెట్టు" అంటూ పురమాయిస్తుంటే మారు మాట్లాడకుండా చెప్పినట్లు చేసింది. బామ్మగారికి ముందు రోజే మాటిచ్చింది—చెప్పింది చెప్పినట్లు చేసేలాగున. ఆలయానికి వెళుతూ వాటినికూడా తీసుకొస్తుంటే, ఇవెందుకు బామ్మా! అని అడిగింది. ఇవి శివుడికి అర్పించాలిలే అంటూ చెబుతుంటే ఫక్కున నవ్వేసింది కళ్యాణి.

"ఏమిటే, ఎందుకా నవ్వు!" చిరాకు పడుతూ అడిగా రావిడ.

"నీ చాదస్తం చూస్తే నవ్వొస్తోంది, బామ్మా! కాయో, పండో ఇస్తే పుణ్యమొస్తుందేమో కాని, ఈ గొడుగులిస్తే ఏం ప్రయోజనం చెప్పు!"

'అందుకే కదే అంత దూరాన్నుండి నే నొచ్చింది. నువ్విలా వితండవాదన చేస్తూ దైవకార్యం సక్రమంగా నెరవేర్చవు తెలిసే హైరాన పడుతూనా వచ్చాను. ఈ కందగొడుగుంది చూశావూ— ఇది శివుడికి సమర్పిస్తే దానికి ఎన్ని పిలకలైతే ఉంటాయో అంత సంతానాన్నిస్తాడు!"

ఆ మాట వింటూనే "బాప్రే" అని గుండెపై చేయి ఆనించుకుంది కళ్యాణి.

"ఇక ఈ పసుపు గొడుగు సమర్పిస్తే నిత్య సౌభాగ్యవతిగా జీవించేలా ఆశీర్వదిస్తాడు.

మరి నువ్విది అర్పించలేదా, బామ్మా? అనబోయింది కాని, ఆవిడ చిన్నబుచ్చుకుంటుందేమోనని మాట్లాడక వూరుకుంది.

రిక్షాని పిలిపించి పూజ సామగ్రి వగైరాల నెక్కించి ఇద్దరూ ఎక్కి కూర్చున్నారు. [illegible] దానాలన్నీ ముగించుకుని ఇల్లు చేరేసరికి పన్నెండయింది.

హాస్పిటల్ బోయ్ రాము వచ్చి డాక్టరుగారు ఇంటికి రావడానికి వీలు పడదని చెప్పడంతో కేరియర్ పెట్టి పంపించేశారు.

"ఆలయంలో పూజలు కూడా అయినవి కదా, బామ్మా! కొంచెం టీ చేసుకుని తాగుదామా!"

"అమ్మో—ఎంత అనాచారమే, తల్లీ! చుక్క కనిపించేవరకూ గొంతు తడుపుకోవా లన్న ధ్యాస మానెయ్! పెద్ద ముండా దాన్ని... నేను ఉపవాస ముండ గంగా లేనిది నువ్వుండ లేవుటే."

అవును కదూ అనిపించింది. నిరాహార దీక్షలు చేసిన వాళ్ళ నందరినీ ఆ సమయంలో మరోసారి స్మరణకి తెచ్చు కుంది.

ఇల్లుగల బామ్మగారు వచ్చి కళ్యాణిని పొగుడుతూ వారి దగ్గర కూర్చుంది.

"అమ్మాయి డాక్టరన్న మాటే కాని, మీ మాట ఎంత చక్కగా వింటుందో? పొద్దుటినుండీ చూస్తూనే ఉన్నాను సుమండీ! అసలీ రోజుల్లో నోట్లోకి నాలుగు ఇంగ్లీషు ముక్కలు వచ్చేటప్పటికి ప్రజల కళ్ళు నెత్తికెక్కి పోతున్నాయంటే నమ్మండి. దైవ పూజలూ లేవు, మడి, ఆచారము అసలే లేవు. ఈ అనాచారుల గురించి అర్ధాంతరపు తుపాను



అలా పీడిస్తున్నారు సుమండీ! ఎంత చదువు చదివినా, ఎన్ని ఉద్యోగాలు చేసినా ఆడది ఆడదే.''

"సరి కానండీ! ఆవిడ మాటకి వత్తాసు పలికారు బామ్మగారు.

"కాసేపు పురాణం చదవండి. నాకీ మధ్య చదవాలంటే కన్నాని చావడం లేదు" అని చెప్పడంతో బామ్మగారు పురాణ పఠనంలో నిమగ్నమై పోయారు.

మెల్లగా వెళ్ళి మంచం మీద వాలి పోయింది కళ్యాణి.

కొద్దిసేపు పురాణ పఠనం అయాక కొద్దిసేపు దైవాల గురించి ఎవరికి తెలిసింది వాళ్ళు గొంతెండి పోయే వరకూ, వాదులు పిడవ పక్కేపరప మాట్లాడు కుంటూనే ఉన్నారు.

ఇల్లు గలావిడ వస్తుందని చెప్పి బామ్మగారి దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయింది. కళ్యాణి పురాణ శ్రవణం చేయకుండా ఎక్కడి కెళ్ళిం దబ్బా! అనుకుని చూసుకుంటూ లోనికి వెళ్ళి చూస్తే మంచంపై మత్తుగా నిద్ర పోతున్న మనవరాలు కనపడగా ముందు కొచ్చింది.

తట్టి లేపడానికి ముందుకు వెళ్ళారు కాని, తను బయలుదేరి వచ్చేటప్పుడు కోడలు చేసిన హెచ్చరిక గుర్తు కొచ్చి తగ్గిపోయారు.

పూర్వకాలం చాదస్తంతో అమ్మాయిని పూరికే హైరాన పెట్టేయ్యకండి. కటిక ఉపవాసాల కది తట్టుకో లేదు. దానికి సాధ్యమైనట్టు గానే చేయనీయండి అంటూ కోడలు పదేపదే చెప్పింది.

పొన్నే శరీరానికి కాస్త విశ్రాంతి కలిగితే అంతగా నీరసం అనిపించదు. చాలా సమయం అయినట్టుంది. నను గురు ముత్తైదువుల్ని భోజనానికి పిలిపించాను. నాలుగు కూరలూ, పచ్చళ్ళు, పిండివంటలూ చెయ్యాలి కదు మరి అనుకుంటూ వంట గదిలోని కెళ్ళి పోయారు.

గిన్నెల చప్పుళ్ళతో మెలుకవ వచ్చింది కళ్యాణికి. అబ్బ చాలా నిద్ర పోయినట్లున్నానే అనుకుని బద్ధకంగా లేచి బయట కొచ్చింది. బామ్మ ఉన్న గదిలోని కెళ్ళబోయి, గేటు తీసుకుని హడావుడిగా వస్తున్న రాముడు చూసి ఆగిపోయింది.

"అమ్మగారూ! అస్పత్రికి అర్జంటుగా రావాలి." వగరుస్తూ చెప్పాడు అతను.

"ఏమైనా సీరియస్ కేసా?"

"సరిటి కేసండి. ఆయ ఉంది కదాని మేము చూస్తున్నాం. ఆవిడేమో ఇనుడు అమ్మగారొస్తే గాని నా వల్లయేలా లేదని చెప్పడంతో అయ్యగారు మిమ్మల్ని వెంట పెట్టుకు రమ్మని నన్ను పరుగెత్తించారు.

"ఆలాగా. పదపద!" అంటూ చెప్పులు కాళ్ళకు తగిలించుకుని, "బామ్మా! అర్జంటు కేసేదో వచ్చిందట. ప్రభాకర్ కబురు చేశా"డంటూ బామ్మగారికి వినపడేలా ఒక కేక పెట్టి ఆవిడ సమాధానానిక్కూడా ఎదురు చూడకుండా కంగారుగా బయలుదేరింది.

ఇంటికి, హాస్పిటల్ కి రెండు ఫర్లాంగుల దూరం మాత్రమే ఉంటుంది.

కళ్యాణి చెప్పింది విని, ఈ ఒక్క రోజూ వెళ్ళకుండా ఉండకూడదేం ? అనుకుంటూ ఇవతలి కొచ్చిన బామ్మగారికి హాస్పిటల్ సమీపంగా కనిపించిన మనవరాలు కంట పడి ఏం పిల్లో ఏమో వ్రతం చేసే రోజైనా తీరుబడిగా ఉండకూడదూ! పెద్దాళ్ళు ఎందుకు చెబుతున్నారో వినికూడా వినిపించుకోరు! మెల్లగా సణుక్కుంటూ లోని కెళ్ళి పోయారు.

కళ్యాణికి నర్స్ ఎదురొచ్చి కేసు పరిస్థితి గబగబ రెండు ముక్కల్లో వివరించి తీసుకెళ్ళింది. అనుభవజ్ఞురాలైన నర్స్ ని తీసుకోవడం ముఖ్యం. ఇప్పుడున్నామె అంతంత మాత్రమే! కష్టమైన కేసులు తను చూడవలసిందే అనుకుంటూనే కేసు పరిస్థితి పరిశీలించింది.

తొలి చూలు కాన్పేమో, ఆ అమ్మాయి పూరికే బెంబేలుపడిపోతూంది. ఆ పిల్ల తల్లి కాబోలు పూరికే ఏడ్చేస్తూ, 'డాక్టరమ్మా! నా బిడ్డని నాకు దక్కించు చాలమ్మా!' అంటూ కాళ్ళమీద పడి ఏడుపు లంకించుకుంది.

"మీ అమ్మాయి కేం ఫరవాలే"దని ఆమెని సమాధాన పరిచి— "ఎప్పుడుమొదలయ్యాయి నొప్పులు" అని అడిగింది.

"రాత్రి నుంచమ్మా."

"రాత్రి నొప్పు లొస్తే ఇప్పుడా తీసుకు రావడం! "గద్దింపుగా అంది.

"హాస్పిటల్ పురుడు మా ఇంట ఎవరికీ ఆనవాయితీ లేదమ్మా. ఎవరికి పురుడొచ్చినా ఇంటి దగ్గరే! అలాగే అవుతాది కదా అని చూస్తే మంత్రసాని ప్రమాదమయ్యేలా ఉంది. హాస్పిటల్ కి తీసుకుపొండి అని ఇందాకే చెప్పిందమ్మా అది చెప్పాక ఆలస్యం చేయలేదు."

హు ప్రజల్లో మూఢత్వం బాగా ప్రబలి పోయింది. ఆనవాయితీట ఆనవాయితీ! విసుగ్గా అనుకుని, ఆవిడ్ని బయటికి పంపించేసి నర్స్ కేదో పురమాయించింది.

చకచక చిన్న ఆపరేషన్ చేసి బిడ్డని లాగింది.

పండంటి పిల్లాడ్ని చూసుకుని అప్పటి





వరకూ పడ్డ కష్టాన్ని మరిచి పోయింది తల్లి. ఆ పురిటిలో తల్లయితే 'అస్పట్లో పురుడన్నా సవ్యంగా అవుతదో లేదోనని బేజారెత్తి పోయనమ్మా. నా బిడ్డని రక్షించావు అంటూ ఆమె చేతులు కళ్ళ కద్దుకుంటుంటే, చిన్నగా నవ్వేసి—''నా గొప్పతనం ఏముంది నేను చేయవలసింది చేశానంతే! హాస్పిటల్ సౌకర్యం ఉంటే కూడా వీరు ఇంటి దగ్గరే పెట్టుకుని కంగారు పడడం తప్పు. ఇంకోసారి ఇలా చేయకండి'' అని మందలించి ఇవతలి కొచ్చేసింది మిగిలిన పని నర్సుకి అప్పగించి.

తలంతా దిమ్ముగా ఉండడంతో అప్పుడు గుర్తొచ్చింది—ఈ రోజు టీ అయినా తాగలేదని. గుర్తొచ్చాక మరీ నీరస మనిపించింది.

పేషెంట్లను చూడడం ముగించి అప్పుడే తీరికయాడు ప్రభాకర్. భార్య వాలకం చూస్తూనే గతుక్కుమన్నాడు వ్రతాల పేరిట ఈ రోజు ఉపవాసం అన్నది గుర్తొచ్చి.

ఉలిక్కి పడ్డట్లుగా లేచి ఫ్లాస్కులో ఉన్న టీ కప్పులోకి వంపి ఇచ్చాడు.

చిన్నగా నవ్వుతూనే వారించి వీరు తీసుకోండంటూ అతడి ముందుకి పెట్టేసింది.

ముందు బామ్మగారికి భయపడి వద్దం టుందనుకున్న ప్రభాకర్, భార్య నిజం గానే తాగడానికి ఒప్పుకోక పోవడంతో ''ఈ బూజు సిద్ధాంతాలు డాక్టరవ్వై యుండి నీ క్కూడా ఒంటపట్టాయా!'' అంటూ చికాకు పడ్డాడు.

''ఏమనుకున్నా ఈ రోజంతా తన ఇష్ట ప్రకారమే చేస్తానని బామ్మకి మాటిచ్చాను. అయినా బామ్మ మాట ల్లోని విశ్వాసం వల్ల నో లేక పున్నమి విశిష్టతో కాని ఈ రోజు నా మనసు కూడా ప్రశాంతంగానే ఉంది. ప్లీజ్, బామ్మ కిచ్చిన మాట చెడ గొట్టుకునేల చేయకండి.'' బతిమాలుతున్న స్వరంతో అని ఇంకా అక్కడే ఉంటే భర్త నుండి ఏం ఎదుర్కోవలసొస్తుందోనని ఇంటికి వెళతానంటూ బయట కొచ్చేసింది.

నివ్వెరపాటుతో ఆమె వెళ్ళిన దిక్కుకే చూస్తుండి పోయాడు ప్రభాకర్.

గేటు తీసుకొస్తున్న మనుమ రాల్ని చూస్తూనే ఎదురొచ్చారు బామ్మ గారు. అంత అర్జంట్ కేసే మొచ్చిందే అంటూ.

''బామ్మా! ఈ రోజు నే వెళ్ళకపోతే ఏమయ్యే దనుకున్నావ్. ఒక తల్లీ బిడ్డల ప్రాణం నిష్కారణంగా ఎగిరి పోయేది.''

''ఏమ్మా! తల్లి కేమంటుంది, బిడ్డ కేమయింది?''

''అహ నే ననేది వేర్వేరుగా కాదు, బామ్మా! కడుపులో బిడ్డని వెంటనే పైకి తీసుండకపోతే పెద్ద ప్రాణానికీ—''

''అంటే. నువ్. నువ్విప్పుడు పురుడు పోసొచ్చావు టే!'' ఆమె మాట పూర్తి చేయనీకుండానే కంగారుగా అడిగేశారు.

ఆ మాటంటుంటే ఆవిడ గొంతుక తారా స్థాయికి లేచిపోవడంతో బిక్క చచ్చిపోయి చూస్తూండి పోయింది కళ్యాణి.

''అలా దెయ్యంలా చూస్తావేమే! పున్నమి రోజు శివారాధన చేసి, ఇంకా వ్రతం పూర్తిగాకుండానే పురటాల్ని ముట్టుకుంటావుటే?''

అప్పుడు కాని తన తప్పిదం తెలీలేదు కళ్యాణికి. బామ్మా ఆటంక పెట్టిం దనలు తనవు పురిటి కేసులు చేయ కూడదనేమో! అంక్షలో మొదటిది ఇదీ అని తెలిస్తే తను బామ్మకీ చెప్పక పోయేది.

చిన్నప్పటినుంచీకూడా బామ్మ పట్ల ఎక్కువ భయ భక్తులతో మెలిగేది. దానివల్ల ఆమెతో గట్టిగా వాదించు డానికి ధైర్యం చాలకనూ, ఆమె నియమ నిష్ఠలు చిన్నప్పటి నుంచి ఎరిగున్న దవ కం వల్లనూ, ఏం చెబితే ఏం తంటా వస్తుందోనని దిగులు పడిపోయింది.

బామ్మగారి వాగ్ధాటి ఇంకా ఆగ లేదు. మనవరాల్ని దుయ్య బడుతూనే తనని తనే తిట్టుకో సాగారు. అసలు అక్కడినుంచి ఎగురుకుంటూ రావడం నాది బుద్ధి తక్కువ! ఇప్పటి వాళ్ళు నా మాటేం వింటారని పూరుకోక ఏదో హెరగ బెడదామని నొచ్చాను కాని, నే నింకొక్క క్షణంకూడా ఉండలేని అరిష్టపు కొంపలో. ఇటువంటి పనులు చేస్తే నే అరిష్ట మేర్పడేది. వచ్చే జన్మలో నీ కేం జన్మ రాసి పెట్టాడో కానీ, భగవంతుడా, నా నోటితో నేను అనలేను. ఇక నేను పోతాను!—అంటూ ఆవిడ ఉగ్రంగా లోపలికి దారి తియ్యడంతో కంగారు పడిపోయిన కళ్యాణి— ''అలా అనకు, బామ్మా!''

అంటూ ఆదుర్దాగా ఆవిడ వెనక పడ్డది.

వెళ్ళే దల్లా గబుక్కున ఆగి వెనక్కి తిరుగుతూ, ''అగు! తలారా స్నానం చేసి గడప దాటు'' అని గర్జించడంతో కిమ్మనకుండా నూతిదగ్గ రికెళ్ళిపోయింది కాళ్ళీడ్చుకుంటూ.

నూతి దగ్గ రికి బామ్మ ఆజ్ఞ ప్రకారం నడిచింది కాని, ఒళ్ళంతా ఏ మాత్రం ఓపిక లేనట్లుగా ఉంది. పసుపు ముద్ద తెచ్చి చేతిలో విదిల్చుతున్న ఆమెను పరిశీలనగా చూస్తూ—

''బామ్మా! ఈ రోజు నువ్ బ్రాహ్మ ణులకి, దేవునికి ఏమిటి ఇప్పించావ్?'' మెల్లగా అడిగింది. అలా అడుగుతున్న కళ్యాణిని చుర్రుమనేలా చూస్తూ 'ఎన్ని దానాలైనా చేయించాను. ఒక్క దానికీ ఫలితం లేకుండా చేశావ్?' ఈసడింపుగా అన్నారు.

''ఆ. అదే. ఎన్నో దానాలు చేయిం చావు కాని, స్వతహాగా నేను చేసిన దెంత మంచి పనో గుర్తించావా, బామ్మా! మరో అరగంట నే వెళ్ళక పోయి నట్లయితే రెండు ప్రాణాలు దాటిపోయేవి. అటు వంటి వారిని రక్షించి వారికి ప్రాణ దానం చేశాను. అన్ని దానాల కెల్ల ప్రాణ దానం గొప్పది కదూ.''

ఆ మాటతో ఆవిడ ముఖంలో కాస్త ప్రసన్నత గోచరించింది. అయినా మాట్లాడటం ఇష్టం లేనట్లు లోపలి కెళ్ళి పోవడంతో ప్రాణం ఉస్సు రనిపించింది.

నూతి చప్టా మీద బకెట్ నిండా తోడి ఉన్న నీళ్ళని చూసి నిట్టూర్చి దాన్ని బాత్ రూమ్‌కి చేరవేయడానికి చేత బుచ్చుకుంది కాని, ఎంత ప్రయత్నిం చినా కాళ్ళు, చేతులు కూడి రావడం లేదు. బామ్మ పెట్టిన చివాట్లకి ఒళ్ళు మరి కాస్త చచ్చు పడి నట్లయింది. లేని ఓపిక తెచ్చుకుని నాలు గడుగులు వేసిందో, లేదో తూలి పడిపోయింది.

అలిసిపోయి వచ్చిన దాన్ని అ నవస రంగా మందలించాను. దాని బాధ్యత అది నెరవేర్చడంలో దాని తప్పు మాత్రం ఏముంది! అనుకుంటూ లోపల ఉండ బట్టలేక బయటి కొచ్చిన బామ్మగారు కళ్యాణి పడున్న తీరు చూసి కంగారు పడిపోయారు. పరిస్థితి గుర్తించి చెంబెడు మంచినీళ్ళందుకుని ముఖమంతా తుడిచి కొంచెం కొంచెంగా నోట్లోకి పొయ్య సాగారు.

మరో అరగంట నే వెళ్ళనట్లయితే ఇద్దరి ప్రాణాలు ఎగిరి పోయేవి! అటు వంటి వారిని రక్షించి వారికి ప్రాణ దానం చేశాను! అని మనవరాలు అన్న ఈ మాట మదిలో మెదిలి పూర్తిగా జ్ఞానో దయం అయింది బామ్మగారికి.

తెప్పరిల్లిన కళ్యాణి కంగారుగా చూస్తూ— ''బామ్మా! నే స్నానం చెయ్యనిదే నువ్వు—''

''ఎందుకు ముట్టుకున్నా వంటు న్నావా! నా తల్లి, నీలోనే ఆ దేవు డుంటే, వేరే దేవుని కోసం నీ చేత బలవంతాన ఉపవాసం చేయించాను.'' ఆవేదనగా అంటూ లోనికి నడిపి స్తుంటే—కోటి పున్నములు మోమున విరియగా బామ్మగార్ని సంభ్రమంగా చూస్తూండి పోయింది కళ్యాణి. ★